సాక్షి
వికారాబాద్

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



యథేచ్ఛగా చెట్ల నరికివేత!

చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో▸



విగ్రహ ప్రతిష్ఠాపన

ఓంకారేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. 8లో▸



అధికారులు లేక..

ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ విభాగానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ శాఖలో ఖాళీ పోస్టులు ప్రజలను వేధిస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 176 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుంచి 176 ఫిర్యాదులు స్వీకరించారు. ధరణి భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూ సర్వే తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించారు. వీటిని ఆన్లైన్‌లో రికార్డ్ చేసి.. ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పర్వీనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాంబండ ఆలయ ఈఓగా బాలనర్సయ్య



బాలనర్సయ్యను సన్మానిస్తున్న ఆలయ పాలకవర్గం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర ఆలయ ఈఓగా బాలనర్సయ్య నియమితులయ్యారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ నుంచి వెలువడిన ఉత్తర్వుల మేరకు సోమవారం ఆయన ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఓగా పనిచేసిన సుధాకర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాల నర్సయ్య మాట్లాడుతూ.. మైపాల్‌రెడ్డి సహకారంతో ఆలయాభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్లిన సుధాకర్‌ను పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు.

బషీరాబాద్ డీటీగా రుక్సానాబేగం



బషీరాబాద్: మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా రుక్సానా బేగం సోమవారం బాధ్యతలు చేపట్టారు. నల్లగొండ నుంచి బొంరాస్‌పేటకు వచ్చిన ఆమెను డిప్యూటేషన్‌పై బషీరాబాద్‌కు నియమించారు. తహసీల్దార్ వెంకటేష్‌కు రిపోర్టు చేసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా రుక్సానా మాట్లాడుతూ.. రేషన్‌కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని.. బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సన్మానం



అనంతగిరి: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ సోమవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా ఆర్టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్ తేనీటి విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాఫర్ పట్టణంలోని తన కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను సన్మానించారు. హుస్సేనీ జాఫర్ ఆర్టీఏ సభ్యుడిగా నియమితులవడంతో హర్షం వ్యక్తం చేస్తూ అజ్మతుల్లా ఆయన్ను సన్మానించారు.

ప్రజాస్వామ్యంలో దాడులు మంచివి కావు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

మొయినాబాద్: ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం మంచి పద్ధతి కాదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం ఆమె చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రంగరాజన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలను మొదట్లోనే తుంచి వేయకపోతే ప్రమాదమని.. అందుకే దాడి చేసినవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఘటనలో 26 మంది ఉన్నారని.. ఇప్పటికే ప్రధాన నిందితుడితోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఒకటి రెండు రోజుల్లో అందరినీ అరెస్టు చేస్తామని వెల్లడించారు.

బకాయి రూ.10 కోట్లు

రెండేళ్లుగా 'మన ఊరు- మన బడి'బిల్లులు పెండింగ్

- ఇబ్బంది పడుతున్న ఎస్‌ఎంసీ చైర్మన్లు
- బిల్లులు విడుదల చేయాలని ప్రజావాణిలో వినతి

వికారాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మన ఊరు–మన బడి కార్యక్రమం రూపొందించి గ్రామస్తులనే భాగస్వామ్యం చేయాలని సంకల్పించింది. స్థానికులకే సమస్యలపై అవగాహన ఉంటుందనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లకు బదులుగా ఎస్‌ఎంసీ(స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ) చైర్మన్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పనులు అప్పగించింది. దీంతో వారు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేయగా.. నేటికీ రూ.10.35 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో వారు తాము వడ్డీ చెల్లించలేక తంటాలు పడుతున్నామని.. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు. పనులు చేపట్టే క్రమంలో వెంటబడిన అధికారులు ఇప్పుడు బిల్లులు విడుదల చేయించాలంటే కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిధిలోని ఎస్‌ఎంసీ చైర్మన్లు కలెక్టర్ కార్యాలయానికి విచ్చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించకుంటే పాఠశాలలకు తాళం వేస్తామన్నారు. బిల్లులు చెల్లించకుంటే తమకు చావే శరణ్యం అంటూ ఆవేదన వెళ్లిబుచ్చారు.

పేరు మార్చారు.. బిల్లులు మరిచారు

మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు మన ఊరు–మనబడి కార్యక్రమం చేపట్టింది. ఈ పనులను కాంట్రాక్టర్లకు కాకుండా ఎస్‌ఎంసీ కమిటీల ద్వారా చేపట్టింది. పనులు పూర్తయి రెండేళ్లవడం.. ఇంతలో ప్రభుత్వం మారడంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితం అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.



ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్లు

మొత్తం పాఠశాలలు	1,130
మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూల్స్	371
పనులు పూర్తయినవి	62
చెల్లించిన బిల్లులు	రూ.21.94 కోట్లు
పెండింగ్ బకాయి	రూ.10.35 కోట్లు

జిల్లా వ్యాప్తంగా 1,130 పాఠశాలలుండగా.. మన ఊరు–మనబడిలో అభివృద్ధి చేపట్టిన 62 పాఠశాలను మినహాయించి మిగిలిన 1,068 పాఠశాలల్లో పనులు ప్రారంభించి ఆరు నెలలు తిరగకుండానే పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సైతం చెల్లింపులు దాదాపు పూర్తయ్యాయి. కానీ ఏడాదిన్నర క్రితం ఎస్‌ఎంసీ(స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ) చైర్మన్లు, సర్పంచ్‌లు, వార్డులు సభ్యులు పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ బిల్లులు చెల్లించాలని కోరుతూ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, డీఈఓలు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అప్పులు చేసి చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని లేదంటే తమకు చావే శరణ్యమంటూ అధికారులను ప్రాధేయపడుతున్నారు.

62 పాఠశాలల బిల్లులు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా 1,130 ప్రభుత్వపాఠశాలలుండగా మూడింట ఒకటో వంతు చొప్పున మొదటి విడతలో 371 పాఠశాలల్లో మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సకాలంలో బిల్లులు అందక పనులు నత్తనడకన నిర్వహించారు. పాఠశాల ప్రహరీల నిర్మాణం, ఫర్నిచర్ సమకూర్చడం, విద్యుత్ మరమ్మతులు, తాగునీరు, ఫ్లోరింగ్ పనులు, టాయిలెట్స్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు చేపట్టారు. రెండున్నర ఏళ్ల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా కేవలం 62 పాఠశాలల్లోనే పనులు పూర్తి చేశారు. ఈ పనులకు సంబంధించి గత ప్రభుత్వం రూ.21.94 కోట్లు, రూ.2.5కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన బిల్లులు కలుపుకుని రూ.24.4 కోట్ల బిల్లులు అందాయి. పూర్తైన పనులకు సంబంధించి రూ.7.35 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులు, రూ.3 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సిన నిధులు మొత్తం రూ.10.35 కోట్లు బకాయి పెండింగ్‌లో ఉన్నాయి. పనులు పూర్తయి రెండేళ్లు కావస్తున్నా బిల్లులు రావడం లేదు.. ప్రభుత్వం స్పందించి తమ బిల్లులు చెల్లించి తమను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్లు విన్నవిస్తున్నారు.



బొంరాస్‌పేట: జనంతో కేటీఆర్ కరచాలనం

కారు క్యాడర్ హుషార్!

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపిన రైతు నిరసన దీక్ష

- గులాబీమయంగా మారిన కొడంగల్ నియోజకవర్గం

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో సోమ వారం నిర్వహించిన రైతు నిరసన దీక్షకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ దీక్ష బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. రోడ్లన్నీ ఫ్లెక్సీలతో గులాబీ రంగు పులుముకున్నాయి. పరిగి నుంచి తుంకిమెట్లకు చేరుకున్న కేటీఆర్ జాతీయ రహదారిపై అభివాదం తెలుపుతూ ముందుకు సాగారు. గులాబీ కండువా ఊపుతూ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపారు. ప్రధాన కూడలిలో ఉన్న సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఉద్యమకారుడి కుటుంబానికి పరామర్శ

ఇటీవల మృతిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు, పార్టీ యువ నాయకుడు వడ్ల మోనాచారి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనంతరం అక్కడి నుంచి కోస్గిలోని రైతుదీక్షకు వెళ్లారు. ఈ పర్యటనలో పార్టీ నేతలు మహమూద్ అలీ, కౌశిక్‌రెడ్డి, నాయకులు యాదగిరి, మహేందర్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, నెహ్రూనాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, చాంద్‌పాషా, తిరుపతయ్య, మల్లేశ్‌గౌడ్, అవినాశ్ తదితరులున్నారు.

తండాకు తాళం



నిర్మానుష్యంగా రోటిబండాతండా

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి కేంద్రంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన రైతు నిరసన దీక్ష ప్రజామద్దతు కూడగట్టుకుంది. మండల పరిధిలోని రోటిబండ తండా వాసులంతా ఇళ్లకు తాళాలు వేసి దీక్షకు వెళ్లారు. గతంలో ఈ తండా వాసులంతా కాంగ్రెస్ సానుభూతిపరులు అని పేరుండేది.. లగచర్ల ఘటన తర్వాత గిరిజనులు జైలుకు వెళ్లడంతో వారికి బీఆర్‌ఎస్ అండగా నిలబడింది. దీంతో తమకు అండగా ఉన్నవారికి తాము మద్దతివ్వాలని బీఆర్‌ఎస్ దీక్షకు వెళ్తున్నామని చెప్పారు.



ట్రస్ట్ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ట్రస్ట్ సేవలు అభినందనీయం

- ఏఎస్ జీఎంకే ట్రస్ట్ భవన ప్రారంభోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు: ఏఎస్ జీఎంకే ట్రస్ట్ సేవలు అభినందనీయమని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో మసీదు, ఏఎస్‌జీఎంకే ట్రస్ట్, ఇస్లామిక్ సెంటర్ నూతన భవనాలను ప్రారంభించి ముస్లిం మతపెద్దలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వ్యాపారి ముజీబ్‌ఖాన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 104 మంది ఇమామ్‌లు, మొజిన్‌లకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు అందించి మానవత్వం చాటుకున్నారన్నారు. అనంతరం ముజీబ్‌ఖాన్ మాట్లాడుతూ.. దేవుడి కృపతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నాని చెప్పారు. హిందువుల్లో ఇల్లు లేని పేద బ్రాహ్మణ కుటుంబాలకు సైతం ఇంటి స్థలాలు అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బీపీజీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ కౌన్సిలర్లు ఇర్ఫాన్, పట్లోళ్ల నర్సింలు, నాయకుడు నయీం, ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి రెండు స్టడీ సెంటర్లు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: గ్రామాల్లో విద్యార్థులు, యువత, నిరుద్యోగులు పఠనాసక్తిని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని రేగడిమైలారంలో విచ్చేశారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ ఏర్పాటు కోసం అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండలానికి రెండు స్టడీ సెంటర్లు అవకాశం ఉందని వాటి ఏర్పాటుకు భవనాలను పరిశీలిస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌తో పల్లె వికాసం: నర్సింలుగౌడ్

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్ అన్నారు. ప్రతీ పంచాయతీకి రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు, సీసీ రోడ్లు త్వరలో మంజూరు కానున్నాయని చెప్పారు. ప్రజా పాలనలో పల్లెలు వికసిస్తాయన్నారు. మూడుమామిళ్లతండా పంచాయతీ పరిధిలో డీప్లానాయక్‌తండా, ఎంఎంతండా, బాపన్‌చెర్వుతండా పరిధిలోని భీక్యానాయక్‌తండా, బాపన్ చెర్వుతండాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పటేల్‌చెర్వుకట్ట వద్ద ఆయకట్టు కాల్వ నిర్మాణం పనులు పరిశీలించారు. ఎత్తుపెంచేందుకు, పంటకాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్‌రెడ్డిని పార్టీ నాయకులు,అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చంద్రప్ప, గ్రామాధ్యక్షుడు గుండప్ప, గోవింద్‌గౌడ్, విజయ్‌కుమర్, ప్ర శాంత్, రఘుపతి రాజు, నివాస్ తదితరులున్నారు.

చేయని పనులకు ఎంబీ రికార్డు!

- చెక్కు ఇవ్వాలంటూ కాంట్రాక్టర్ల ఒత్తిడి
- ఎక్మాయి ప్రాథమిక పాఠశాలలో నిధుల స్వాహాకు యత్నం
- హెచ్‌ఎంపై ఒత్తిడి తెస్తున్న విద్యాశాఖ అధికారులు



హెచ్‌ఎంతో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి 'అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాల' పనుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. స్కూల్‌లో వసతుల కల్పన కోసం గతేడాది రూ.6.20 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను గ్రామ సమాఖ్య సభ్యులకు అప్పగించారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ సరఫరాతో పాటు పాఠశాల మరమ్మతుల కోసం ఈ నిధులను వినియోగించాలి. ఇందులో భవన మరమ్మతులకు రూ.4 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.లక్ష, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.70 వేలు, విద్యుత్ సరఫరాకు రూ.50 వేలు ఖర్చు పెట్టాలి. ఈ పనులకు సంబంధించి అడ్వాన్స్ కింద గుత్తేదార్లకు రూ.1.56 లక్షలు చెల్లించారు.

వెలుగులోకి ఇలా..

గతంలో ఇక్కడ పీఆర్ ఏఈగా పనిచేసిన అధికారి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చేయని పనులకు ఎంబీ రికార్డులు చేశారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేశామని రూ.3.20 లక్షలు రికార్డు చేశారు. ఇందుకు సంబంధించిన ఎంబీ తీసుకుని తమకు 2.13 లక్షల చెక్కు ఇవ్వాలంటూ మహిళా సమాఖ్య సభ్యులు అంబిక, స్వరూప, రోహినా హెచ్‌ఎం సుప్రియ వద్దకు వెళ్లారు. అయితే పాఠశాలలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండగా ఈ పనులన్నీ ఎప్పుడు చేశారని ఆమె నిలదీశారు. దీనిపై స్పందించిన గుత్తేదార్లు.. 'ఏఈ ఎంబీ రికార్డు చేశారు. డబ్బులు కూడా ఖాతాలో జమయ్యాయి. వెంటనే చెక్కు రాసివ్వు.. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం' అని తనపై ఒత్తిడి చేస్తున్నారంటూ హెచ్‌ఎం వాపోయారు.

జిల్లా అధికారుల ఆరా

ఇదే విషయమై డీఈఈ కార్యాలయం అధికారులు సోమవారం హెచ్‌ఎంకు ఫోన్ చేసి చెక్కు ఇవ్వాలని ఆదేశించారు. రికార్డు అయ్యాక ఎందుకు బిల్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారని హెచ్‌ఎం వాపోయారు. మరోవైపు బషీరాబాద్ ప్రస్తుత ఏఈ యశ్వంత్‌ను కలెక్టర్ పేషీకి పిలిచిన ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగంపై ఆరా తీశారు. దీంతో తనకు సంబంధం లేదని, గతంలో పనిచేసిన ఏఈ ఎంబీ చేశారని తాను వివరణ ఇచ్చినట్లు యశ్వంత్ తెలిపారు.



నీటి సరఫరాలేని కులాయిలు

చర్యలకు గ్రామస్తుల డిమాండ్

ఎలాంటి పనులు చేయకుండా ఎంబీ రికార్డు చేసిన అధికారులతో పాటు పనులు చేయకపోయినా బిల్లులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాఠశాల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం హెచ్‌ఎం సుప్రియతో సమావేశమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెక్కు ఇవ్వొద్దని వారు సూచించారు.



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

మితిమీరిన వేగం.. తెచ్చింది ప్రమాదం

- కారును ఢీకొట్టిన క్రూజర్
- 12 మందికి తీవ్ర గాయాలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ సమీపంలోని కృష్ణాజలాల రిజర్వాయర్ సమీపంలో అతి వేగంగా వస్తున్న క్రూజర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ నర్సింహారావు కథనం ప్రకారం.. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి మాజీ సర్పంచ్ చిగురింత శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు సంపత్‌రెడ్డికి నగరంలో శనివారం ప్రమాదం జరిగింది. కొడుకును ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి సోమవారం సాయంత్రం శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి రాంచంద్రారెడ్డి, తల్లి భారతమ్మ, పెద్దమ్మ జయమ్మ మరో బంధువుతో కలిసి కారులో బీఎన్‌రెడ్డి నగర్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గ మధ్యలో గునుగల్ గేట్ కృష్ణాజలాల రిజర్వాయర్ సమీపంలోని మలుపు వద్ద యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వేగంగా వస్తున్న క్రూజర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అయితే కారు డోర్లు ఓపెన్ కాకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు భయాందోళనతో కేకలు వేయగా ప్రయాణికులు బలవంతంగా కారు డోర్లు లాగి వారిని బయటకు తీశారు. క్రూజర్‌లో ఉన్న ఏడుగురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు డోర్లను లాగుతున్న ప్రయాణికులు



తీవ్రంగా గాయపడిన ఓ మహిళ

క్లుప్తంగా

'సాక్షి' కృషి అభినందనీయం

ఎంఈఓ అబ్దుల్ రెహమాన్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధికారులు, సాక్షి ప్రతినిధులు

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సాక్షి అందించే మెటీరియల్ ఎంతో మేలు చేస్తుందని మండల విద్యాధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎక్ మామిడి, చిట్టిగిద్ద, నవాబుపేట, ఆదర్శ, కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉపయోగకరమైన స్టడీ మెటీరియల్స్‌ను సాక్షి ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయడం హర్షించదగిన విషయమన్నారు. సాక్షి పేపర్, టీవీ ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందన్నారు. అందుకే ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సాక్షి యాజమాన్యం మరిన్ని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాక్షి సర్క్యులేషన్ ఇన్‌చార్జి సుధాకర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



యుద్ధభేరి పోస్టర్ విడుదల చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు

తాండూరు టౌన్: యూపీఎస్ పెన్షన్ విధానంతో ఉద్యోగుల ఆర్థిక భద్రతకు ముప్పు వాటిల్లుతుందని టీఎస్‌సీపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ పాషా, రాష్ట్ర సాహిత్య సభ్యులు మురహరినాథ్ అన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 2న హైదరాబాద్‌లో యుద్ధభేరి కార్యక్రమంతో నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం తాండూరులో ఉద్యోగులు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో పలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు వినోద్, నారాయణగౌడ్, శ్రీనివాస్, సంతోష్, అనిల్, మనోహర్, మల్లేష్, రమేష్, శ్రీధర్, శ్రీశైలం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ తదితరులు

పూడూరు: రౌడీషీట్‌లు ఓపెన్ అయిన వారందరూ సత్ప్రవర్తనతో మెలగాలని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ప్రత్యక్షంగా ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో వచ్చే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా గొడవలకు కారమైనట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్‌లను ఎత్తి వేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత!

- జోరుగా సాగుతున్న కలప అక్రమ రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప



లింగన్‌పల్లి శివారులో చింతచెట్ల నరికివేత

బొంరాస్‌పేట: అటవీ ప్రాంతంలో అడ్డూఅదుపు లేకుండా చెట్ల నరికివేత కొనసాగుతుంది. కలప అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పట్టపగలే వృక్షాలు విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నప్పటికీ అటవీశాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా మండల పరిధిలోని కొత్తూరు రేంజ్ పరిధిలో చెట్ల నరికివేత విచ్చలవిడిగా సాగుతోందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. రేంజ్ పరిధిలోని కొత్తూరు, రేగడి మైలారం, లింగన్‌పల్లి, ఎన్కేపల్లితోపాటు పలు తండాల్లో అటవీ ప్రాంతంతోపాటు ప్రభుత్వ భూములు, వ్యవసాయ పొలాల్లో ఉన్న చెట్లు కోతకు నిత్యం గురవుతున్నాయి. అందులో ముఖ్యంగా చింత చెట్లను ఎక్కువగా వధిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

మండలంలోని బొంరాస్‌పేట, రేగడిమైలారం, తుంకిమెట్ల, లింగన్‌పల్లి తదితర గ్రామాల్లో అనుమతి లేకుండా చెట్లను నరికివేసే వ్యాపారులున్నారు. ఇటీవల కట్టెల వ్యాపారులు పెరిగిపోయారు. అంతేకాకుండా యథేచ్ఛగా వృక్షాలను నరికివేస్తున్నారు. తుమ్మ, మామిడి, చింత, తదితర చెట్లు విచ్చలవిడిగా అక్రమ కలప రవాణాదారుల చేతుల్లో నరికివేతకు గురవుతున్నాయి.

లోపించిన పర్యవేక్షణ

అటవీశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిఘా లేకపోవడంతో పట్టపగలే చెట్లను నరికివేసి రహదారుల గుండా కలప రవాణా జరుగుతోంది. ఇప్పటికైనా అటవీ అధికారులు, సిబ్బంది నిఘా పెంచి అక్రమ కలప రవాణా, చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై అటవీశాఖ సిబ్బందిని సంప్రదించగా ఫారెస్ట్ రేంజ్ అధికారి సవిత సెలవులో ఉందన్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆన్‌లైన్ విధానంతో రైతు తమ పాస్‌బుక్, ఆధార్ కార్డులతో అనుమతులు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల అనుమతికి మించి నరికివేతలుంటున్నాయి. కొత్తూరు బీట్‌కు ఇద్దరు అధికారులు, కొడంగల్‌కు ఇద్దరు బీట్ అధికారులుండాలి. సిబ్బంది కొరత కారణంగా పర్యవేక్షణ ఇబ్బందిగా ఉంది. చెట్ల నరికివేతపై చర్యలు తీసుకుంటాం.

– రతన్‌సింగ్, సెక్షన్ అధికారి, కొడంగల్



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా కల్యాణోత్సవం

- బిజ్వార్‌లో మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని బిజ్వార్(బొంకూర్) గ్రామంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం మహిళలు డోలు, డప్పు వాయిద్యాల నడుమ బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. దేవాలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ క్రతువును వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా డోలు విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో శివ స్వాముల మహా పడిపూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముదిగిండ్ల రవికుమార్ ఇంట్లో నిర్వహించిన పూజలో శివనామస్మరణ మార్మోగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్యక్రమంలో దాదాపు 150 మంది శివ స్వాములు పాల్గొన్నారు.

శోభాయమానంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తజనం

ముగిసిన ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలు

కుల్కచర్ల: మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఓంకారేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం హోమంతో పాటు ఓంకారేశ్వర విగ్రహ ఏర్పాటు, వీరభద్రస్వామి, నంది తదితర దేవతామూర్తులను ప్రతిష్ఠించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహారాష్ట్ర దుదుని, ఆలంపల్లి మఠాధీశులు చెన్నబసవ ప్రభు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచనాలు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు రాజప్ప, బాలముకుందం, సురేష్, స్వామి, ప్రకాష్, సతీష్, ప్రేమ్‌కుమార్, రవిచందర్, రాజశేఖర్, రాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన భారతి సిమెంట్స్



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్న భారతి సిమెంట్స్ ప్రతినిధులు

ఓంకారేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమం కొనసాగింది. ఇందులో భారతి సిమెంట్స్ సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు భారీగా మజ్జిగ ప్యాకెట్లను అందజేసింది. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్స్ టెక్నికల్ ఆఫీసర్ సామ్రాట్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి, డీలర్లు శ్రీకాంత్, సందీప్, స్థానిక నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులుముదిరాజ్, భరత్‌కుమార్, హరికృష్ణ, రాఘవేందర్‌గౌడ్, ప్రకాష్, సతీష్, రాజేశ్వర్, భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి హత్య

షాబాద్: అదృశ్యమైన ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధి మన్మర్రి గ్రామానికి చెందిన జటని సత్యమ్మ(65) ఈ నెల 7న ఉదయం షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ ఠాణా పరిధి రంగంపల్లి వద్ద వృద్ధురాలి మృతదేహం కనిపించడంతో.. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు అక్కడికి వెళ్లి చూసి సత్యమ్మగా గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసుకుని, హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

షాబాద్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన గడ్డం చంద్రయ్య(48) ఈ నెల 8న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం స్థానిక పహిల్వాన్ చెరువులో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవాన్ని బయటకు తీసి చంద్రయ్యగా గుర్తించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

షాబాద్: స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. సీఐ కాంతారెడ్డి వివరాల ప్రకారం.. 2021 సంవత్సరంలో షాబాద్ మండల పరిధి లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో మునిరి రమేష్, నర్సింహులు కలిసి మరో వ్యక్తిని హత్య చేశారు. అప్పట్లో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత మునిరి రమేష్ మృతిచెందాడు. నేరం రుజువుకావడంతో నర్సింహులుకు పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ఎల్బీనగర్ అదనపు కోర్టులో న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అప్పటి సీఐ అశోక్‌తో పాటు ప్రస్తుత సీఐ కాంతారెడ్డి, రఘు, సత్యనారాయణ, సిబ్బంది వెంకటేశ్, ప్రభాకర్, జంగయ్యలు చూపిన తగిన ఆధారాలతో నేరం రుజువై.. నిందితుడికి జైలు శిక్ష పడినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

షాబాద్: దుండగులు ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రకళ ఈ నెల 9న ఉదయం షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా వస్తువులు చిందరవందరగా పడున్నాయి. బీరువాలో ఉన్న పుస్తెలతాడు, బంగారు ఆభరణాలు, నగదుతో పాటు.. టీవీ అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న పాఠశాల బస్సు

ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థి సాత్విక్



తలకు గాయంతో ఆయమ్మ మంగమ్మ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థితో పాటు ఆయమ్మ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి బొంగ్లూర్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లోని నలంద గ్రామర్ హై స్కూల్‌కు చెందిన మినీ బస్సు.. దినచర్యలో భాగంగా సోమవారం ఉదయం చింతపల్లిగూడకు చెందిన విద్యార్థులతో పాఠశాలకు బయలుదేరింది. ఈ క్రమంలో కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌కు సమీపంలో అయిల్ మిల్ వద్దకు రాగానే, బస్సు అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న 10 మంది విద్యార్థుల్లో మూడో తరగతి చదువుతున్న సాత్విక్ చేతికి బలమైన గాయం అయింది. ఆయమ్మ మంకాల మంగమ్మ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. డ్రైవర్ కిషన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తుర్కయంజాల్‌లోని ఆరోగ్య ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్పందించలేదని విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే విషయమై పట్నం పోలీసులను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించిన ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సాంస్కృతిక సారథికి నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

కందుకూరు: మండల పరిధి తిమ్మాపూర్‌కు చెందిన ప్రజా జానపద గాయకుడు, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మంద ప్రభాకర్ నంది అవార్డు అందుకున్నారు. తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కళాకారులకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారుడిగా, సాంస్కృతిక సారథిగా ప్రభాకర్ చేసిన సేవలను గుర్తించి.. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సామేల్, సుప్రసిద్ధ నాటక, టీవీ, సినీ సంగీత దర్శకుడు రాజబాబు ఆయనకు నంది అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ యువీ రత్నం, నిర్వాహకులు ధనరాజ్, ఉషారాణి తదితరులు మందను అభినందించారు.

మధుబన్ కాలనీలో వాహన తనిఖీలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలను చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై జయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలను నిర్వహించారు. హెల్మెట్ ధరించని, సీట్ బెల్ట్ వేసుకోని, లైసెన్స్ లేని వాహనాలతో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న వారిని పట్టుకుని చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ యాదగిరిరెడ్డి తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఎస్.బాలకిషన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే పిల్లర్ నంబర్ 161 సమీపంలో వ్యక్తి మృతదేహం (55) ఉందని పోలీసులకు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మరణించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు స్థానికంగా వాకబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బందిని గానీ, అత్తాపూర్ పోలీసులను గానీ సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ బీసీ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో బీసీలు 65శాతం మంది ఉన్నారని, వారు ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల కులగణన చేపట్టిందని, బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెనుకబడిన బీసీల కోసం మహాసభ ఎంతో కృషి చేస్తుందని, వారిని చైతన్యం చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతుందని వెల్లడించారు. చట్టసభల్లో తగిన రిజర్వేషన్ సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా యువత అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, నాయకులు సదానంద్, కృష్ణంరాజు, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయం జరగడం లేదని ఆత్మహత్యాయత్నం

కోర్టు ఎదుట మహిళను నిలువరించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: 'కోర్టుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. నేను బతికి ఉండగా నా పిల్లలు ఆగమైపోతున్నారు. చావే శరణ్యం' అంటూ ఓ గిరిజన మహిళ న్యాయస్థానం ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం మంతన్‌గౌరెల్లి గ్రామం కేసీతండాకు చెందిన జర్పుల భద్రీయ కమలబాయి దంపతులు. భద్రియ మరో మహిళ పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో ఆమె చాలాకాలంగా వేరుగా ఉంటోంది. మొదటి భార్య కమలకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నాడు. రెండో భార్యకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మొదటి భార్య పెద్ద కుమార్తె వివాహం అయింది. మరో కూతురు పెళ్లి కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. రెండో భార్య అయిన పద్మ ముగ్గురు పిల్లల వివాహం భద్రీయ దగ్గరుండి జరిపించాడు. దీంతో మొదటి భార్య కమల తీవ్ర మనోవేదనకు గురైంది. భర్త పట్టించుకోవడం లేదంటూ.. రెండు ఎకరాల పొలం పిల్లలకు ఇవ్వాలని 2021లో ఇబ్రహీంపట్నం కోర్టులో కేసు వేసింది. కేసు కొనసాగుతుండగానే భద్రియ 20 గుంటల పొలం అమ్మేశాడు. మరో ఎకరాభూమిని విక్రయించడానికి బేరసారాలు కుదుర్చుకున్నాడు. దీంతో మనస్థాపం చెందిన ఆమె.. న్యాయం జరగడం లేదని, నియమించుకున్న న్యాయవాదులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తూ.. కోర్టు ఆవరణలో బలవన్మరణానికి యత్నించింది. గమనించిన పోలీసులు ఆమెను నిలువరింపచేశారు. అక్కడి నుంచి పట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కోర్టులో న్యాయం దక్కుతుందని చెప్పారు. కోర్టు ఎదుట ఇలాంటి పనులు చేయడం నేరమని పేర్కొంటూ ఆమెపై కేసు నమోదు చేశారు.



ధారూరు సమీపంలో పూసిన మోదుగ పూలు

విరబూసిన మోదుగ

ధారూరు: శివరాత్రి పర్వదినం రోజున పరమ శివుడికి మోదుగ పూలతో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న మోదుగ పూలు శివరాత్రి పండుగకు ముందుగానే ధారూరు సమీపంలో వికసించాయి. కాషాయం రంగులో ఉండి లోపల ఓంకారం, కలశం ఆకారాలతో ఉండడం మోదుగ పూల ప్రత్యేకత. వీటిని శివాలయంలో శివలింగానికి సమర్పించి భక్తులు మొక్కుకుంటారు.